జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శనివారం | 21-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 621 పేజీలు: 4 వెల : రూ.7






# జిల్లాలో రైల్వేల అభివృద్ధి..
# పరుగులు పెట్టిస్తాం

* జిల్లాలో ప్రతీ స్టేషన్‌ను అభివృద్ధి చేసుకుని వచ్చాం
* భవిష్యత్‌లో మరిన్ని విప్లవాలు సృష్టిస్తాం
* త్వరలో విశాఖ రైల్వేజోన్ ప్రారంభమవుతుంది
* కూటమి ప్రభుత్వంలో సిక్కోలు మరింత అభివృద్ధి
* శ్రీకాకుళం నుంచి సికింద్రాబాద్, తిరుపతికి నేరుగా రైళ్లు ఏర్పాటుకు కృషి
* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
* హరిశ్చంద్రపురం, మందస, పాతపట్నం స్టేషన్‌లలో నూతన హాల్ట్‌లను ప్రారంభించిన కేంద్ర మంత్రి



శ్రీకాకుళం, మార్చి 20(వార్త): శ్రీకాకుళం జిల్లాలో రైల్వే వ్యవస్థను మరింత విస్తృత పరుస్తామని కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం జిల్లాలోని కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ లో విశాఖ-గుణపూర్ పాసింజర్ రైలు హాల్ట్‌ను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలసి ప్రారంభించారు. అదేవిధంగా మందస రోడ్ రైల్వే స్టేషన్‌లో బెర్హాంపూర్ విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో, పాతపట్నంలో రోర్కెల గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ నూతన హాల్టును స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావులతో కలసి ప్రారంభించారు. హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి హామీ ఇచ్చి.. కొద్ది రోజుల్లోనే హాల్ట్ మంజూరు అయ్యేలా కృషి చేసిన రామ్మోహన్ నాయుడు కు ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వచ్చేలా చెయ్యాలని కోరారు. హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్ కు చేరుకునే అప్రోచ్ రోడ్లను విస్తృతం చెయ్యాలని కోరారు. అదే విధంగా నందిగాం - రౌతుపురం లో రోడ్డు అభివృద్ధి, టెక్కలిలో ఉన్న రైలు గేటును డబుల్ గేట్‌గా విస్తృత పరచాలని అచ్చెన్నాయుడు కోరారు. అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ హరిశంద్రపురం రైల్వే స్టేషన్‌లో ట్రైన్ హాల్ట్ కోసం విశేష ప్రయత్నం చేశామని.. ఉగాది పర్వదినం సమీపంలో అది సాకారం అవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సర్వీస్ ద్వారా స్థానిక రైతులకు, మహిళలకు, విద్యార్థులకు మరింత ఉపయుక్తంగా మారనుందన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, గుణుపూర్ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ అభివృద్ధికి హద్దులు చెరిపేస్తున్నట్లు రామ్మోహన్ నాయుడు అన్నారు. హరిశ్చంద్ర పురం స్టేషన్‌లో ప్లాట్ ఫాం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, స్టాపేజి.. ఇలా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. స్టేషన్ ను ఆనుకుని రైల్వే పరిధిలోని 40 ఎకరాలను సైతం అభివృద్ధి చేస్తామని, తద్వారా ఉపాధి అందుతుందని తెలిపారు. వేర్ హౌస్, గూడ్స్ షెడ్, కంటైనర్ టెర్మినల్ లాంటి వాటిని ఇక్కడ ఏర్పాటు చేస్తామని అన్నారు. రైల్వే జోన్‌ను విశాఖలో త్వరలో ప్రారంభిస్తామని.. ఇకపై మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు కార్యరూపం దాల్చుతాయని ధీమా వ్యక్తం చేశారు. పోర్టు ఏర్పాటు ద్వారా అటు రాయ్ పూర్ నుండి ఇటు ఒడిశా వరకు అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సాల్ట్ భూముల సమస్యను పరిష్కరించామని అన్నారు.. అభివృద్ధి చేస్తూ ఉన్నామని.. కంపెనీలు రావడమే ఆలస్యం అని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల ఆశీస్సులు శ్రీకాకుళం జిల్లాపై మెండుగా ఉన్నాయని.. కూటమిలో సిక్కోలు మరింతగా అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. నలభై ఐదు రోజుల వ్యవధిలోనే 6 స్టాపులు శ్రీకాకుళంలో మంజూరు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్‌లో సమీప స్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఇతర రైళ్ళను కూడా స్టాపేజి కల్పిస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం నుండి నేరుగా సికింద్రాబాద్, తిరుపతి లకు రైళ్ల ఏర్పాటు కోసం విశేష కృషి చేస్తున్నట్టు తెలిపిన రామ్మోహన్ నాయుడు.. అందుకు రైల్వే శాఖ నుండి, మంత్రి అశ్వినీ వైష్ణవ్ నుండి సానుకూల స్పందన వచ్చినట్టు తెలిపారు. సర్వేలు కూడా ఈ విషయంపై సాగుతున్నట్టు అన్నారు. జిల్లాలో రైల్వేల అభివృద్ధికి తన తండ్రి దివంగత కింజరాపు ఎర్రంనాయుడు విశేష కృషి చేశారని.. ఆయన



ఆశయ సాధనకు తాను ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు. మందస రోడ్ రైల్వే స్టేషన్ లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి విస్తరణకు ప్రణాళిక సిద్ధం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. మందస స్టేషన్‌లో భవిష్యత్లో మరిన్ని హాల్ట్ లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పాతపట్నంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో పాతపట్నం నుండి వారంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల కు కృషి చెయ్యాలని కోరారు. దీనికి ఎంపీ మాట్లాడుతూ మూలపేట పోర్ట్ ఏర్పాటు నేపథ్యంలో ఆ పోర్టుకు ఒరిస్సాను అనుసంధానం చెయ్యడం లో పాతపట్నం స్టేషన్ కీలకంగా మారుతుందని అన్నారు. ఈ నౌపడ గుణుపూర్ లైన్ ను 1200 కోట్లతో మరింతగా పొడిగిస్తున్నామని హామీ ఇచ్చారు. అదేవిధంగా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాతపట్నం, టెక్కలి స్టేషన్ లను క్రాసింగ్ స్టేషన్లగా మార్చుతామని హామీ ఇచ్చారు. ఈ నౌపడ, టెక్కలి పాతపట్నం లైన్ ను డబుల్ లైన్ గా మార్చడానికి కూడా కృషి చేస్తున్నామని ఆర్.డి.ఓ ద్వారా సర్వే ప్రయత్నాలు కూడా చేస్తున్నామని తెలిపారు. 9కోట్ల రూపాయలతో నితిన్ గడ్కరీ దగ్గర కూర్చొని నీలమణి దుర్గ ఆలయం వద్ద ఫ్లై ఓవర్ మార్పులు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ రైల్వే డి.ఆర్.ఎమ్ లలిత్, ఖుర్దా డి.ఆర్.ఏం సునీల్, యార్లగడ్డ వెంకన్న చౌదరి, రైల్వే అధికారులు, కూటమి శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.

## మందసలో ఇంటర్ సిటీ నిలుపుదలతో ప్రజలకు మేలు

మందస, మార్చి 20(వార్త): మందస రైల్వే స్టేషన్‌లో ఇంటర్ సిటీ ట్రైన్ నిలుపుదలతో ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు అన్నారు. మందస మండలంలోని మందస రైల్వే స్టేషన్‌లో ఇంటర్ సిటీ ట్రైన్‌కు నిలుపుదల అనంతరం పచ్చజెండా ఊపి, అధికారికంగా ఇంటర్ సిటీ ట్రైన్ హాల్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందస పరిసర ప్రాంత ప్రజల దీర్ఘకాలిక కోరికను దృష్టిలో ఉంచుకుని, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రత్యేకంగా మాట్లాడి ఈ హాల్ట్‌ను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇంటర్ సిటీ ట్రైన్ నిలుపుదలతో మందస చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు శ్రీకాకుళం, విశాఖపట్నం, బ్రహ్మపుర(బరంపురం) వంటి నగరాలకు ప్రయాణం మరింత సులభతరం కానుందన్నారు. మందస రోడ్డు రైల్వే స్టేషన్‌లో బ్రహ్మపుర-విశాఖపట్నం ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల(హాల్ట్) ప్రారంభం కావడం స్థానిక ప్రజలకు గొప్ప ఊరటనిచ్చే అంశమని తెలిపారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక నాయకులు వెంకన్నచౌదరితో కలిసి పచ్చజెండా ఊపి రైలును ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఈ ప్రాంత పెద్దలు, కూటమి నాయకులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.






# చిన్న గొడవ.. ప్రాణాలు తీసింది!

* ఆవేశంతో ద్విచక్ర వాహనం నుంచి మోహన్‌ను తోసేసిన యువకుడు * రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి * పోలీసులకు లొంగిపోయిన నిందితుడు * మండల వీధిలో విషాదం * మోహన్ కృష్ణ పాడె మోసిన ఎమ్మెల్యే గొండు శంకర్, టీడీపీ నాయకులు

శ్రీకాకుళం క్రైం, మార్చి 20 (వార్త): చిన్నపాటి గొడవ.. చివరకు ప్రాణాలు తీసేసింది. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం నగరం మండలవీధికి చెందిన గొర్లె మోహన్‌కృష్ణ(26) టీడీపీ జిల్లా కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గురువారం నరసన్నపేటలో జరిగిన పార్టీ సమావేశానికి హాజరై రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి తిరిగొస్తున్నాడు. ప్రభుత్వ మహిళా కళాశాల జంక్షన్ వద్ద ఆయన మేనల్లుడు హరీష్ మహాలక్ష్మీనగర్ కాలనీకి చెందిన గద్దె మనోహర్‌తో కనిపించాడు. రాత్రిపూట ఇక్కడేం పని అని మేనల్లుడిని మోహన్‌కృష్ణ మందలించాడు. దీంతో పక్కనే ఉన్న మనోహర్.. మోహన్‌కృష్ణతో వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆగ్రహానికి గురైన మనోహర్ మోహన్‌కృష్ణను బండిపై నుంచి తోసేశాడు. దీంతో కిందపడిన మోహన్‌కృష్ణకు తలకు రోడ్డు తగలడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే వారంతా మోహన్‌కృష్ణను శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.



వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మనోహర్ వెంటనే వన్‌టౌన్ పోలీసుల వద్ద లొంగిపోయాడు. శ్రీకాకుళం రూరల్ సీఐ పైడిపునాయుడు, వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికులు నుంచి వివరాలు తీసుకొని దర్యాప్తు చేపట్టారు.

## మోహన్‌కు ఘన నివాళి

తెలుగుదేశం పార్టీకి నిబద్ధతతో సేవలందించిన మోహన్ అకాల మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మోహన్ అంత్యక్రియలు విషాద వాతావరణంలో నిర్వహించగా, స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ దగ్గరుండి కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ నివాళులర్పించారు. మోహన్ పాడెను స్వయంగా మోసి ఆయనపై ఉన్న అనుబంధాన్ని చాటుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.మోహన్ తండ్రి రమణ కూడా పార్టీకి ఎన్నో సంవత్సరాలు సేవలందించగా, ఆయన మరణం అనంతరం కార్యాలయ బాధ్యతలను మోహన్‌కు అప్పగించారు. అప్పటి నుంచి మోహన్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ నమ్మకమైన కార్యకర్తగా గుర్తింపు పొందారు. మోహన్ ఆకస్మికంగా మరణించడం అందరినీ కలచివేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ, మోహన్ మరణం పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మోహన్ అంత్యక్రియల్లో జిల్లా అధ్యక్షులు మొదలవలస రమేష్, పట్టణ అధ్యక్షులు పాండ్రంగి శంకర్ , మాదారాపు వెంకటేష్, రెడ్డిగిరిజశంకర్ , ఇప్పిలి తిరుమలరావు , ఇతర నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తుది వీడ్కోలు పలికారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 22న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

**శ్రీకాకుళం, మార్చి 20 (వార్త):** శ్రీకాకుళంలోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 22న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ అధ్యక్షతన ఉదయం 10:30 గంటల నుంచి వరుసగా ఏడు స్థాయి సంఘాల సమావేశాలు జరగనున్నాయి. ఉదయం 10:30కు 6వ స్థాయి సంఘం, 11:30కు 3వ సంఘం, మధ్యాహ్నం 12:30కు 5వ సంఘం సమావేశం కాగా.. మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 2, 4, 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో ఈ సమావేశాలకు హాజరుకావాలని సీఈఓ కోరారు.

## నేటి పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష వాయిదా

**శ్రీకాకుళం, మార్చి 20 (వార్త):** రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా ప్రభుత్వం శనివారం (మార్చి 21) సెలవు ప్రకటించిన నేపథ్యంలో, ఆ రోజు జరగాల్సిన పదో తరగతి, ఓపెన్ స్కూల్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఏప్రిల్ 2వ తేదీకి, అలాగే ఓపెన్ స్కూల్ గణితం, భారతీయ సంస్కృతి పరీక్షలను మార్చి 30వ తేదీకి వాయిదా వేశారు. ఈ పరీక్షలు నిర్ణీత సమయం ప్రకారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతాయని, గతంలో కేటాయించిన ఇన్విజిలేటర్లు, సిబ్బంది అందరూ మారిన తేదీల్లో యథావిధిగా విధులకు హాజరుకావాలని ఆయన స్పష్టం చేశారు.

### భూమితో అనుసంధానమైతే వచ్చే..
# అనుభూతి అనిర్వచనీయం

- వ్యవసాయ విద్యార్థులు ఎంతో గొప్పవారు.
- వారి చేతిలోనే ప్రపంచ భవిష్యత్
- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- నైరా వ్యవసాయ కళాశాలలో రూ.36.60 లక్షల ఎంపీల ల్యాడ్స్ నిధులతో బస్సు ఏర్పాటు.
- ప్రారంభించి.. స్వయంగా నడిపిన రాము
- గర్ల్స్ హాస్టల్ కోసం రూ.20 లక్షల నిధులు తక్షణం మంజూరు



**శ్రీకాకుళం రూరల్, మార్చి 20 (వార్త):** కంప్యూటర్‌తో పనిచేస్తే వచ్చే అనుభూతి కన్నా.. భూమితో భాగస్వామ్యమై చేసే పని ఇచ్చే సంతృప్తి ఎంతో గొప్పదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన శ్రీకాకుళం మండ లం నైరా వ్యవసాయ కళాశాలలో ఎంపీ లోకల్ ఏరియా డెవలప్మెంట్ నిధులతో మంజూరు చేసిన రూ.36.60లక్షల బస్సును.. ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దిన కర్ పుండ్కర్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం కళా శాల ఆవరణ లో బస్సును కాసేపు నడిపి అక్కడివారిని ఉత్సాహపరిచారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్య క్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాలకు అవస రమైన వినతులను కేంద్ర మంత్రి చెంతకు కళాశాల సిబ్బంది చేర్చారు. కళాశాలకు మహిళా హాస్టల్ విస్తరణ అవసరం ఉందని తెలుపగా.. అక్కడే కలెక్టర్ తో మాట్లాడి.. 20 లక్షల తక్షణ నిధులను మంజూరు చేయిం చారు. అనంతరం కేంద్ర మంత్రి సభను ఉద్దేశించి మాట్లా డారు. జిల్లాలోని నైరా వ్యవసాయ కళాశాల అంటే.. నాలాంటి ఎంతోమందికి గర్వకారణం అన్నారు. ఈ కళా శాల నుంచి దేశ..విదేశాల్లో వివిధ హోదాల్లో మంచి స్థానాల్లో ఇక్కడి విద్యార్థులు స్థిరపడిన సంగతులను గుర్తు చేశారు. ఇక్కడి విద్యార్థులు చక్కగా చదువుతూ ఉన్న.. వారికి రైతులతో కలుస్తూ... క్షేత్ర స్థాయి పరిస్థితులు అవగాహన చేసుకోవడం ఎంతో ముఖ్యమని కళాశాల అధ్యాపక సిబ్బంది.. ఇక్కడి పరిస్థితులను వివరించినట్టు రామ్మోహన్నాయుడు తెలిపారు. వారి అవసరాలు తీర్చే విధంగా తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.36.60 లక్షల నిధులతో బస్ మంజూరు చెయ్యడం ఆనందంగా ఉందన్నారు. ఈ బస్సు ఇక్కడి విద్యార్థులతో పాటు.. వీరి పరిజ్ఞానాన్ని పంచుకున్న రైతులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మీకు, రైతులకు మధ్య నాలెడ్జ్ ట్రాన్స్ఫర్ కోసం బస్సు వారధిగా ఉపయోగపడుతుందని తెలిపారు. చక్కగా ఈ బస్సును మెయింటైన్ చేసుకుని సుదీర్ఘకాలం వాడాలని కోరారు. ఒకప్పుడు విద్య అంటే బాలికలను దూరంగా ఉంచేవారని.. అందుకు భిన్నంగా ఉన్నత విద్య వైపు సైతం సుదూర ప్రాంతాలకు విద్యార్థినులను పంపిస్తూ.. దేశ ఉన్నతిలో భాగస్వామ్యం అవుతున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. గత తరం, ఇప్పట్లో కొంతమంది కంప్యూటర్ ముందు గడిపే ఉద్యోగం కోసం ప్రాకులాడుతూ ఉండేవారని.. కంప్యూటర్ కీ బోర్డు పడితే వచ్చే అనుభూతి కన్నా.. ఇలా వ్యవసాయాన్ని విద్యగా మార్చుకుని.. దానినే తమ భవిష్యత్ గా మార్చుకునే విద్యార్థులకు, భూమితో భాగస్వామ్యం అయ్యి జీవితం గడిపే వారికి వచ్చే అనుభూతి ఎంతో గొప్పదని రామ్మోహన్ నాయుడు అన్నారు. అన్ని ప్రస్తుత ప్రపం చంలో మారుతున్నారు కానీ, రైతులు.. రైతాంగ పరిస్థితులు మారడం లేదని అన్నారు. అనేక సవాళ్లు ప్రస్తుతం రైతుల ఎదురుగా ఉన్నాయని దిగుబడులు పెంచే విధంగా ఎకా నమీ ఛాలెంజ్‌కు వ్యవసాయ విద్యార్థులు లక్ష్యాలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. మీరు ల్యాబ్స్ లో నేర్చుకొనేవి. రైతుల జీవితాలను మార్చే దిశగా ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. నేటి తరంలో పొలిటీషియన్స్ కన్నా.. ఫార్మింగ్ విద్యార్థులు ఎంతో గొప్పవారు అని అన్న రామ్మో హన్ నాయుడు.. భవిష్యత్ అవసరాలు తీర్చాలి అంటే అది వ్యవసాయ విద్యార్థుల చేతుల్లోనే ఉందని.. ఆది సాధ్యమైన రోజు వ్యవసాయ విద్యార్థులకు తాను సెల్యూట్ చేస్తా అని హామీ ఇచ్చారు. నీరు, ఎరువుల వాడకంలో మార్పులు తట్టుకునే విధంగా నూతన ఆవిష్కరణలు వైపు దృష్టి సారించాలన్నారు. ప్రకృతితో మమేకం అయ్యి వ్యవసాయం సాగేలా ఉండాలని తెలిపారు. దేశ, విదేశాల్లో గొప్ప స్థానాలు అధిరోహించిన వ్యక్తులు ఉన్న నైరా కళాశాల శక్తిని ఇక్కడి విద్యార్థులు గుర్తెరగాలి అని రామ్మోహన్ నాయుడు అన్నారు. వ్యవసాయ విద్యార్థులకు భవిష్యత్‌లో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాలలో గర్ల్స్ హాస్టల్ కోసం మరిన్ని నిధులను మంజూరు చేసే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివారన్ చింగ్ చౌహాన్ చెంతకు సమస్యను చేరవేస్తానని తెలిపారు. మాటూరు రైస్ వెరైటీ తరహాలో నైరా నుంచి కూడా అగ్రికల్చర్, హార్టికల్చర్‌లలో నూతన వంగడాలను ఆవిష్కరించాలని ఆకాంక్షించారు. పౌర విమా నయంలో నేడు కార్గో కూడా ప్రధాన భూమిక పోషి స్తోందని.. కార్గోలో ప్రధానంగా ఎగుమతి అయ్యేది వ్యవ సాయ ఉత్పత్తులు అన్న విషయాన్ని గుర్తెరగాలి రామ్మోహన్ నాయుడు అన్నారు. పౌర విమానయాన కారణంగా వ్యవ సాయ ఉత్పత్తులకు ఇకపై గ్లోబల్ మార్కెట్ అనుసంధానం అయి ఉంటుందన్న విషయాన్ని రైతులు గుర్తెరగాలన్నారు. కంప్యూటర్‌తో ఉద్యోగాలు చేసేవాళ్లు సైతం ఇరవై ఏళ్ల తరువాత మళ్లీ ప్రకృతితో కనెక్ట్ అవ్వడానికి ప్రయత్నిస్తూ ఉండటం శుభపరిణామం అని అన్నారు. సభ కార్యక్రమం అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. తరగ తులు సాగుతున్న తీరు, అవసరమైన ఇతర మౌలిక వస తుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వంశధార ప్రాజక్ట్ కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర, నైరా వ్యవసాయ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.






## ఇంద్రపుష్కరిణికి మహర్దశ

- ఆధునికీకరణ పనులకు నేడు మంత్రి అచ్చెన్న శ్రీకారం
- రూ.4 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కూటమి ప్రభుత్వ హయాంలో వేగవంతమైన అడుగులు
- భక్తుల సౌకర్యార్థం మరిన్ని వసతులు

**అరసవల్లి, మార్చి 20 (వార్త):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఇంద్రపుష్కరిణి దశ తిరగనుంది. ఏళ్ల తరబడి నిరీక్షణకు తెర దించుతూ, ఈ పవిత్ర కోనేటి ఆధునికీకరణ పనులకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో మంజూరైన రూ.4 కోట్ల నిధులతో శనివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగనుంది. ఆదిత్యుని సన్నిధిలోని ఇంద్రపుష్కరిణిలో స్నానమాచరిస్తే సర్వ రోగాలు నయమవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న పుష్కరిణి గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. గతంలో టెండర్లు పిలిచి, అట్టహాసంగా శంకుస్థాపనలు చేసినా పనులు మాత్రం అడుగు ముందుకు పడలేదు. కనీస మౌలిక సదుపాయాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆల యాల అభివృద్ధిపై దృష్టి సారించింది. పెండింగ్‌లో ఉన్న నిధులను సమీకరించి, పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. నియోజకవర్గ పరిధిలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధికి మంత్రి అచ్చెన్నాయుడు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇప్పటికే ఎండల మల్లికార్జున స్వామి, కొత్తమ్మ తల్లి ఆలయాల అభివృద్ధి కోసం రూ.8 కోట్లు మంజూరు చేయగా, తాజాగా అరసవల్లి క్షేత్రానికి రూ.4 కోట్లు కేటాయించడం విశేషం. ఈ నిధులతో పుష్క రిణిని ఆధునికీకరించడమే కాకుండా, భక్తుల కోసం మెరుగైన స్నానపు ఘాట్లు, దుస్తులు మార్చుకునే గదులు, పరిసరాల సుందరీకరణ వంటి పనులు చేపట్టనున్నారు. నేడు జరగ నున్న ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు శాసనసభ్యులు గొండు శంకర్, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. ఎట్టకేలకు పుష్కరిణి పనులు ప్రారంభం కానుండడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ఇచ్ఛాపురం రైల్వే అండర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయండి



**ఇచ్ఛాపురం, మార్చి 20(వార్త):** ఇచ్ఛాపురంలో రైల్వే అండర్ బ్రిడ్జి అండర్ పాసేజీ, ఓవర్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని జెడ్ఆర్‌యుసీసీ సభ్యులు శ్రీనివాస రౌలో కోరారు. ఈ మేరకు డీఆర్ఎం సునీల్‌కుమార్‌కి వినతిపత్రం అంద జేశారు. శుక్రవారం ఆయన మందస రైల్వే స్టేషన్‌లో ఇంటర్ సిటీహల్ట్ కార్యక్రమం లో పాల్గొని ఈ ప్రాంతంలో రైల్వే సమస్యలపై చర్చించారు. జాడుపూడి రైల్వే స్టేషన్‌లో బరంపూర్ టూ విశాఖపట్నం పాసింజర్ స్పెషల్ హల్ట్ , సోంపేట రైల్వే స్టేషన్ కంచమ్మ గుడి వద్ద కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జి, బారువాలో మొదటి ప్లాట్‌ఫారంలో ట్రైన్ హల్ట్, మందస స్టేషన్‌లో సమస్యల గురించి వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ బుడ్డ మనించంద్ర ప్రకాష్, పి.సంతోష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## తామరపల్లిలో పనిచేయని బోరు

- నెల రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజల ఆవేదన
- మరమ్మతులు చేయాలని కోరుతున్న స్థానికులు

**నరసన్నపేట, మార్చి 20 (వార్త):** తామరపల్లిలో సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న బోరు బావి పనిచేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా బోరు బావి పనిచేయకపోవడంతో పలుమార్లు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. ప్రస్తుతం తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రత్యామ్నాయ మార్గాలు లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు పేర్కొన్నారు. వెంటనే బోరు బావిని మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## నీరే ప్రాణాధారం.. వృథా చేస్తే భవిష్యత్ శూన్యం

**శ్రీకాకుళం, మార్చి 20 (వార్త):** నీరే జీవనాధారం, నీరు లేనిదే భవిష్యత్తు శూన్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని (మార్చి 22) పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా న్యాయ సేవా సదన్ నుంచి డేఅండ్ నైట్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హరి బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా కాపాడాలని, రేపటి తరాలకు నీటిని అందించడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. మన చుట్టూ సముద్రం ఉన్నా, తాగడానికి గుక్కెడు మంచి నీరు దొరకని పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఒక్కో నీటి బొట్టును పొదుపు చేసి భావి తరాల గొంతులు తడపాలని ఆయన ఆకాంక్షించారు.

### ర్యాలీలో ప్రతిజ్ఞ.. మానవహారం

ప్రజల్లో నీటి వినియోగంపై చైతన్యం తీసుకురావడానికి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి మానవహారం నిర్వ హించారు. ప్లకార్డులు, పోస్టర్ల ద్వారా నీటి సంరక్షణపై నినా దాలు చేస్తూ ర్యాలీ సాగింది.

కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కె.అమ్మోజీరావు, జి.ఇందిరాప్రసాద్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.




## 24న జిల్లా స్థాయి మాస్టర్స్ క్రీడా పోటీలు

**శ్రీకాకుళం, మార్చి 20 (వార్త):** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 24న నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జిల్లా స్థాయి 'శాప్' లీగ్ మాస్టర్స్ (వెటరన్స్) క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్లు 45 ఏళ్లు పైబడిన పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్ లోని వివిధ విభాగాల్లో (పరుగు పందాలు, జంప్స్, త్రోస్) ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 30, 31 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, ఆసక్తి గల వారు వెంటనే sports.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజి స్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. వివరా లకు 9390352942 నంబర్‌ను సంప్రదించవచ్చని మహేష్ తెలిపారు.

## నేడు కార్గిల్ విక్టరీ పార్కు ప్రారంభం

- ఆధునికీకరణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**శ్రీకాకుళం, మార్చి 20 (వార్త):** శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ ఎదురుగా గల ఏపీ హెచ్ కాలనీలో ఉన్న కార్గిల్ పార్కులో జరుగుతున్న పనులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వయంగా శుక్రవారం పరిశీలించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పార్కులో ఫొటో సెషన్, స్పీచ్ పాయింట్లు






వద్ద ప్రాక్టికల్ డెమో విధానంలో ఫొటోలు తీయించి పరి శీలించారు. పార్కులో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లు సైతం పరిశీలించారు. మిగిలి ఉన్న పెండింగ్ పనులు విడిగా టీములు వారీగా ఏర్పాటు చేసి సత్వరమే పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. శనివారం పార్క్ ప్రారంభోత్సవం సందర్భంగా వి.ఐ.పి.లకు, సైనికుల కుటుంబ సభ్యులకు ఎటు వంటి ఇబ్బందులు కలగకూడదని ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ పరిశీలనలో సుడా ఎస్.ఇ, సుగుణాకర్, మునిసిపల్ కార్పొరేషన్ ఎం.ఈ. శర్మ, ఎంహెచ్ఓ సుధీర్, సైనిక్ వెల్ఫేర్ అధికారి, ఎ.శైలజ, డి.ఎస్.పి. సీహెచ్ వివేకానంద, డీఎస్‌డిఓ మహేష్, సుడా ఏఈలు, కార్గిల్ పార్క్ కాంట్రాక్టర్ వంశీ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలపై ఫిర్యాదుకు హెల్ప్‌లైన్ నంబర్

**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఫిర్యాదు చేసేందుకు జిల్లా గ్రామీణ తాగునీటి సంఫరా, పారిశుధ్య విభాగం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు 9100 120602 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఈ హెల్ప్‌లైన్ సేవలు జూన్ 30 వరకు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండి ఫిర్యాదులను స్వీకరిస్తారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ శంకరబాబు ఒక ప్రకటనలో కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**మందస, మార్చి 20(వార్త):** మందస జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మరణించాడు. సోంపేట నుంచి పలాస వైపు వెళ్తున్న 20ఏళ్ల మనోజ్ అనే యువకుడు ఈ ప్రమాదంలో మరణించాడు. మందస మండలంలోని కొర్రాయి గేటు సమీపంలో ద్విచక్రవాహనంపై వస్తున్న మనోజ్ వాహనం అదుపు తప్పి, ఎడమ వైపు ఉన్న ఐరన్ రైలింగ్‌ను బలంగా ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న మందస ఎస్ఐ కె. కృష్ణప్రసాద్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి, పరిశీలించారు. మృతుడు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం 20 మీటర్ల వరకు వెళ్లి, పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లింది. మనోజ్ స్వగ్రామం వజ్రపుకొత్తూరు మండలంలోని పూండి గోవిందపురమని ఎస్ఐ కృష్ణప్రసాద్ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



## పద్మావతి విద్యార్థినికి రూ.2 లక్షల స్కాలర్‌షిప్

### - ప్రముఖ సంస్థ నుంచి మంజూరు



**నరసన్నపేట, మార్చి 20 (వార్త):** నరసన్నపేటలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినికి ప్రముఖ సంస్థ రూ.2 లక్షల ఉపకార వేతనాన్ని మంజూరు చేసింది. ఈ స్కాలర్‌షిప్ ద్వారా విద్యార్థిని విద్యాభ్యాసానికి అవసరమైన ఫీజులు, ఇతర ఖర్చులను భరించుకోనుంది. ఆ కళా శాలలో డిగ్రీ చదువుతున్న ఆళ్ల ప్రియాంకకు ఈ స్కాలర్‌షిప్‌ను శుక్రవారం విడుదల చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 5,100 మంది విద్యార్థులకు ఈ ఉపకార వేతనం అందజేయడం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్ అభినందించారు. విద్యలో మరింత రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ స్కాలర్‌షిప్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి భవిష్యత్తు నిర్మాణానికి తోడ్పడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పాఠశాలకు రంగుల రాట్నం వితరణ

### - పూర్వ విద్యార్థి శివ సేవాభావం



**జలుమూరు, మార్చి 20 (వార్త):** శ్రీముఖలింగం ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి, సివిల్ ఇంజినీర్ వీరంశెట్టి శివ రూ.20 వేల విలువ చేసే రంగుల రాట్నాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సంతోషకర వాతావరణం నెలకొంది. శుక్రవారం ఉదయం హెచ్ఎం సత్యనారాయణ దీన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఎంతో ఆనందంగా రాట్నంపై ఆడుకుంటూ ఉత్సాహంగా గడిపారు. పాఠశాలకు అవసరమైన సదుపాయాలను అందించడంలో పూర్వ విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శివ చేసిన సహాయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెన్నాపురం పాఠశాల పరిశీలన



**నరసన్నపేట, మార్చి 20 (వార్త):** చెన్నాపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 దాలినాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యా కార్యకలాపాలను సమీక్షించారు. విద్యార్థుల జీఎఫ్ఎన్ఎల్ రికార్డులను పరిశీలించిన ఆయన, ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు రుచికరమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు ఇంటింట ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## మోడల్ పాఠశాల పరిశీలించిన ఎంఈఓ-1



**జలుమూరు, మార్చి 20 (వార్త):** జలుమూరులోని ప్రభుత్వ మోడల్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 బమ్మిడి మాధవరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యకలాపాలను సమీక్షించారు. పాఠశాలకు చేరుకున్న ఆయన ముందుగా విద్యార్థుల సామర్థ్యాలను ఒక్కొక్కరిని ప్రశ్నిస్తూ పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస స్థాయి మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రతిరోజు తప్పనిసరిగా డిక్టేషన్ మరియు హోంవర్క్ ఇవ్వాలని, విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో మౌలిక వసతులను కూడా పరిశీలించి అవసరమైన సదుపాయాలపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొలిగాంలో ఫోకోలా దివస్

**ఇచ్ఛాపురం మార్చి 20 (వార్త):** కొలిగాంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోఖలో దివస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుల నరేంద్ర నాథ్ ఆధ్వర్యంలో జరిగింది. పోఖలో అనేది ఒడియా పదం. పోఖలో అనగా చద్దన్నం. ఇందులో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ కే, బి 6, బి 12 ఉంటాయి. దీంతో శరీరంలో ఇమ్యూనిటీ పెరగడంతో పాటు ఎలెక్ట్రోలైట్స్ సమతుల్యమై జీర్ణవ్యవస్థ బాగా పని చేస్తుందని జీవశాస్త్ర ఉపాధ్యాయిని దుర్గాభవాని అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మోహన్, పాపా రావు, శ్రీనివాస్, దేవకీ, రేణుక, అమిత, స్వప్న, ధర్మరాజు, భాస్కర్, నీలిప్, మీను పాల్గొన్నారు.



## విద్యతోనే ఉజ్వల భవిష్యత్

### -ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూరశ్రీనివాసరావు
### - ఫరీద్ పేట హై స్కూల్ లో మధ్యాహ్న భోజన షెడ్ నిర్మాణం
### - విద్యార్థులకు స్వయంగా భోజనాలు వడ్డించిన శ్రీనివాసరావు

**శ్రీకాకుళం, మార్చి 20 (వార్త):** విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుందని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని ఫరీద్ పేట హై స్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇబ్బందిగా ఉన్న విషయాన్ని తెలుసుకొని, 1999వ సంవత్సరం 10వ తరగతి విద్యార్థుల బ్యాచ్ సహకారంతో నూతనంగా షెడ్ ను నిర్మించారు. ఈ షెడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఒక గమ్యాన్ని ఏర్పాటు చేసుకొని దాన్ని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఆ దశలో మనం ఎంచుకున్న రంగాలను బట్టే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని చెప్పారు. నేడు మారుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాలలో విద్యార్థులు రాణించాలంటే విద్యతో పాటు సృజనాత్మక శక్తి కూడా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు తోడ్పాటున అందించేందుకు తను ఎప్పుడో ముందుంటానని ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలలో పరీక్షకులను అందజేయడం జరిగిందని వాటితో పాటు ఫరీదుపేటలో షెడ్డు నిర్మించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు

### అర్జీలను సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్



**శ్రీకాకుళం, మార్చి 20 (వార్త):** దివ్యాంగుల అర్జీల పరిష్కారంలో జాప్యం జరగరాదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌ను జిల్లా కలెక్టర్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ బి.శైలజ ఆధ్వర్యంలో జరిగింది. ఈ గ్రీవెన్స్‌లో 7 దరఖాస్తులు స్వీకరించారు. వికలాంగ పింఛన్‌కు 1, బ్యాటరీ వెహికల్స్‌కు, సదరం సర్టిఫికెట్‌కు 1 దరఖాస్తు, ఏపీఎస్ఆర్టీసి బస్ రిజర్వేషన్‌లో సమస్యపై 1, ఉద్యోగ, ఉపాధి కల్పించమని కోరుతూ 3 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ

**నరసన్నపేట, మార్చి 20 (వార్త):** నరసన్నపేట మండల విద్యాశాఖాధికారి ఉప్పాడ శాంతారావు శుక్రవారం దూకులపాడు, తండ్యాలవానిపేట పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యా పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఆయన, వారికి మెరుగైన బోధన అందించే దిశగా ఉపా ధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా చదవడం, రాయడం రావాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు ఆసక్తికరమైన బోధన అందించి విద్యార్థుల్లో అభ్యాసంపై ఆసక్తి పెంపొందించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమస్యలు ఆలకిస్తూ..ఆప్యాయంగా పలకరిస్తూ.!

**కోటబొమ్మాళి(నిమ్మాడ), మార్చి 20 (వార్త):** నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో నందిగాం, టెక్కలి మండలాల ప్రజల నుంచి వినతులను రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వీకరించారు. ఈ సందర్భంగా విన తులు సమర్పించేందుకు వచ్చిన ప్రతి ఒక్కరిని మంత్రి ఆప్యాయంగా పలకరించి, వారు వివరించిన సమస్యలను శ్రద్ధగా ఆలకించారు. అనంతరం సంబంధిత అధికా రులకు తక్షణమే ఆదేశాలు జారీ చేసి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది వృద్ధులు తమ పేదరిక పరిస్థితిని వివరించి, తమకు సొంత ఇల్లు లేదని, ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి వెంటనే స్పందించి, అర్హతను పరిశీలించి ఇంటి స్థలం మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అలాగే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరిన వారికి, ప్రభుత్వం త్వరలోనే ఆ ప్రక్రియను పూర్తి చేస్తుందని మంత్రి తెలిపారు.



## జాబ్ క్యాలెండర్‌తో యువతకి భరోసా



**ఇచ్ఛాపురం, మార్చి 20(వార్త):** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ రాష్ట్ర యువతకు ఒక గొప్ప వరంగా నిలిచిందని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జైదేవ్ అన్నారు.స్థానిక 17 వ వార్డు ఇంచార్జి జన్నెల సంతోష్ యాదవ్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే గత 20 నెలల్లో 6,28,347 ఉద్యోగాలను యువతకు కల్పించడం ద్వారా ప్రభుత్వం తన హామీలను నెరవేర్చిందని, ఇప్పుడు ఉగాది సందర్భంగా మరోసారి 10,060 ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ప్రభుత్వానికి ఉన్న యువతపై నిబద్ధతను మరింత స్పష్టం చేస్తోందని అన్నారు.ఈ జాబ్ క్యాలెండర్‌లో పోలీస్, గ్రూప్-1, గ్రూప్-2, ఇంజినీరింగ్, వైద్య తదితర విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన ప్రణాళికను ప్రకటించడం అభినందనీయమని అన్నారు. ఇప్పటికే లక్షలాది ఉద్యోగాల కల్పన (6,28,347) , ఉగాది సందర్భంగా 10,060 కొత్త ఉద్యోగాల ప్రకటన, అన్ని విభాగాల్లో సమగ్రంగా ఉద్యోగ అవకాశాల విస్తరణ, యువత భవిష్యత్తుపై దృష్టి పెట్టిన దూరదృష్టి నాయకత్వం, పారదర్శకంగా సమయపాలనతో నియామక ప్రక్రియ.కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, ఉపాధి సృష్టిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర యువతకు భరోసా కల్పిస్తూ, వారి భవిష్యత్తును నిర్మించే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలోలో రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ సంతోష్ పట్నాయక్, నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ నర్తు అప్పారావు, ఇచ్ఛాపురం పట్టణ తెలుగు యువత అధ్యక్షులు ఆశి ధర్మరాజు, తెలుగు యువత సభ్యులు సాడి ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ కేసులో ఎంపీపై చర్యలు తీసుకోవాలి : ఏఐవైఎఫ్

**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** డ్రగ్స్ కేసులో పట్టుబడిన తెలుగుదేశం పార్టీ ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌పై వెంటనే పార్టీ నుంచి సస్పెన్షన్ విధించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువ జన సమాఖ్య (ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం సూర్య మహల్ జంక్షన్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ మాట్లాడుతూ, ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి ఇలాంటి అక్రమ కార్య కలాపాల్లో పట్టుబడటం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిందని పేర్కొన్నారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని, ముఖ్యంగా యువత భవిష్యత్తును దెబ్బతీసే ఈ సమస్యపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన వారిపై ఎలాంటి రాజకీయ పరిరక్షణ లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉండాలని సూచించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తమ పార్టీ ప్రజాప్రతినిధులే ఇలాంటి కేసుల్లో చిక్కుకోవడంతో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈ ఘటనపై పూర్తి నైతిక బాధ్యత వారే వహించాలని పేర్కొన్నారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపి నిజనిజాలను ప్రజలకు వెల్లడించాలని ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలను కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని కొనసాగిస్తామని, ప్రజల్లో చైతన్యం పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్, కార్యదర్శి కొన్న శ్రీనివాస్, నాయకులు అరవింద్, రామోజీ, వసంతరావు, శ్రీనిధి, అన్నాజీ, హేమంత్, కృష్ణ, వికాస్ తదితరులు పాల్గొన్నారు.




## చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

### - ఆరుగురికి లబ్ధి - ఏఈ రాం చరణ్ గుప్తా



**నరసన్నపేట, మార్చి 20 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు మగ్గం వినియోగిస్తున్న చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ఏఈ రాం చరణ్ గుప్తా తెలిపారు. శుక్రవారం ఆయన నరసన్నపేటలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఆరుగురు చేనేత కార్మికులకు ఈ పథకం కింద లబ్ధి కల్పిస్తున్నామని తెలి పారు. వారికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందజేస్తున్నామని పేర్కొన్నారు. అయితే 200 యూనిట్లకు మించి వినియోగించినట్లయితే మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా చేనేత కార్మికు లకు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన కార్మికులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

## యాచకుని ఉదార స్వభావము



**ఇచ్ఛాపురం, మార్చి 20(వార్త):** ఈదుపురం గ్రామ వాసి గవలపు కేశవరావు "యాచక వృత్తి" చేస్తూ తను దాచుకున్న ధనాన్ని సద్వినియోగం చేయాలనే మంచి ఆలోచనతో తన కుటుంబసభ్యులు, తనను మంచి మార్గములో నడిపించిన గురువు దివంగత నీలగిరి వాసుదేవ్ సిద్ధాంతి జ్ఞాపకార్థం సోంపేట సమీప సీతయ్య ఫౌండేషన్ లో ఉన్న అనాథ వృద్ధులకు భోజన నిమిత్తం కొంత సొమ్మును అందజేశారు. అనాథలకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పిండి, ఆయిల్‌మిల్లు దగ్ధం


### రూ.10 లక్షల ఆస్తి నష్టం




**సోంపేట, మార్చి 20 (వార్త):** బారువ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఓ పిండి మిల్లుతోపాటు ఆయిల్ మిల్లు దగ్ధమయ్యాయి. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాద ఘటనలో బారువ పేటకు చెందిన సిందిరి దేవి అనే మహిళకు చెందిన పిండి మిల్లు, ఆయిల్ మిల్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంతో సుమారు పది లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసిన మిల్లులు ఇటువంటి ప్రమాదంలో దగ్ధం కావడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఆ కుటుంబం తీవ్ర ఆవేదనకు గురవుతుంది. ఈ ప్రమాదం ఎలా జరిగిందో అర్థం కావడం లేదని బాధితులు పేర్కొంటున్నారు. మిల్లులో విద్యుత్ వ్యవస్థ సక్రమంగానే ఉన్నప్పటికీ ప్రమాదం జరగడం చాలా బాధ కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం జరిగిన ఘటనపై స్పందించాలని తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతు న్నారు. ఈ మిల్లులపై ఆధారపడిన రెండు కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గేట్‌లో ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రతిభ





ఎచ్చెర్ల, మార్చి 20 (వార్త): జాతీయ స్థాయి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (గేట్)-2026 ఫలితాల్లో శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షలో ఈసీఈ విభాగంలో సాయి గణేష్ గౌండు 31వ ర్యాంకు సాధించగా, సీఎస్ఈ విభాగంలో ఇంటూరి ఉమేష్ చంద్ర 77వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. వీరితో పాటు సుమారు 20 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడం విశేషం. ఈ సందర్భంగా క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంద్ర అమరేంద్ర కుమార్ విద్యార్థులను అభి నందించారు. విద్యార్థుల కృషి మరి కొందరికి ఆదర్శం కావాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ముని రామకృష్ణ పేర్కొన్నారు. డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులకు అభినందించారు.

## చిన్న కిట్టాలపాడు జడ్పీ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

**సారవకోట, మార్చి 20 (వార్త):** చిన్న కిట్టాలపాడు ప్రభుత్వ జడ్పీ పాఠశాలను ఎంఈఓ మద్దు వెంకటరమణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కార్యకలాపాలను పరిశీలించారు. ఇటీవల 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎస్ఏ -2 పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ఆయన సమీక్షించారు. 10వ తరగతిలోకి ప్రవేశించే విద్యార్థులకు సరైన విద్యాబోధన అందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంఏ రమేశ్ పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546